క్లుప్తంగా

స్థలం చూపండి


జగనన్న ఇంటి పట్టాను చూపుతున్న వీరేశ్

హొళగుంద: తమ కుటుంబానికి జగనన్న కాలనీలో ఇచ్చిన ఇంటి పట్టాకు స్థలం చూపాలని హొళగుందకు చెందిన కుమ్మరి వీరేశ్ కోరుతున్నాడు. జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరైందని, అయితే పట్టా ఇచ్చే సమయంలో తాము అందుబాటులో లేకపోవడంతో స్థలాన్ని చూడ లేదన్నాడు. కొద్ది రోజులుగా స్థలం ఎక్కడ ఉందో చూపాలని నేటి వరకు కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు సెంటు భూమి, ఉండేందుకు ఇల్లు కూడా లేదని కూలీపనులు చేసుకుని బతుకుతున్నామన్నాడు.

అధ్యాపకుడికి ఘనంగా వీడ్కోలు


లెక్చరర్ కె రమణను సన్మానిస్తున్న ప్రిన్స్‌పాల్, లెక్చరర్లు, సిబ్బంది

వెల్దుర్తి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గత రెండేళ్లుగా మ్యాథమేటిక్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహించి గూడూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్స్‌పాల్‌గా పదోన్నతిపై వెళ్లిన కె రమణకు మంగళవారం స్థానిక కాలేజీ బృందం ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రిన్స్‌పాల్ నాగభూషణం రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చిప్పగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్స్‌పాల్ వరదరాజులు హాజరయ్యారు. పదోన్నతిపై వెళ్లిన కె. రమణను లెక్చరర్లు, సిబ్బంది దుశ్శాలువా కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపిక, బహుమతులందించారు. ఆయన సేవలను కొనియాడారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ, దాత

మద్దికెర : పదో తరగతి విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ రంగస్వామి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 86 మంది పదో తరగతి విద్యార్థులకు దాత పారా రవికుమార్ అందించిన యూటీఎఫ్ ప్రచురించిన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమ, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

హొళగుంద: స్థానిక ఎమ్మార్సీ వద్ద ఎస్టీయూ 2025 నూతన సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్, డైరీలను ఎంఈఓ-1, 2లు సత్యనారాయణ, జగన్నాథం చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, శరణప్ప, నాయకులు రమేశ్, పోతరాజు, దొడ్డబసప్ప, బీటీ ఖలందర్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.


యువతి అదృశ్యం

ఆలూరు రూరల్: గత రెండు రోజులుగా తన కుమార్తె కనిపించడం లేదని ఓ యువతి తండ్రి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడని ఆలూరు ఎస్‌ఐ దిలీప్ కుమార్ తెలిపారు. ఎమ్మిగనూరు మండలం మల్కాపురం గ్రామానికి చెందిన ఓ యువతి ఆలూరులోని ప్రభుత్వ మేనేజ్‌మెంట్ హాస్టల్‌లో ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. రెండు రోజుల క్రితం ఆలూరులోని తన బంధువుల ఇంటికని వెళ్లి కనిపించకుండా పోయింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఇసుక రవాణాను అరికట్టాలి

ఆస్పరి: మండలంలో వెంగళాయిదొడ్డి ఆయకట్టు చెరువు నుంచి అక్రమంగా ఇసుకను తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆస్పరి బస్టాండ్‌లో వెంగళాయిదొడ్డి చెరువు పరివాహక ప్రాంత పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. చెరువు పరివాహక ప్రాంత పరిరక్షణ కమిటీ సభ్యులు విరూపాక్షి, అంజినయ్య, వీరభద్రి, హనుమంతు, వెంకటేష్, రామాంజిని ఈరన్న మాట్లాడుతూ ఇసుకను తీసుకెళ్లడం వల్ల తొగలుగల్లు, దొడగొండ, యాటకల్లు, కలపరి, బైలుపత్తికొండ, గార్లపెంట గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం


ఫార్మాసిస్టు బాషావలిని సన్మానిస్తున్న దృశ్యం

దేవనకొండ: స్థానిక ప్రాథమిక ఆ రోగ్య కేంద్రంలో మూడేళ్లుగా ఫార్మాసిస్టుగా సేవలందించిన బాషావలి ఎమ్మిగనూరుకు బదిలీ అయ్యారు. మంగళవారం ఆసుపత్రిలో ఆయనకు డాక్టర్ విజయభాస్కర్, వైద్య సిబ్బంది పూలమాలలు వేసి సత్కరించారు. మెడికల్ ఆఫీసర్లు కళ్యాణ్, వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, సిబ్బంది భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, రంగస్వామి, హనుమంతమ్మ, శ్రీధర్ పాల్గొన్నారు.


ఆలూరులో శిథిలమైన చెత్త సంపద కేంద్రం


ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రం పక్కనే వేసిన దృశ్యం


చుంచుఎర్రగుడిలో కంపచెట్లతో నిండిన సంపద తయారీ కేంద్రం

చెత్త సంపద ఉత్తిదే!

- లక్షలు వెచ్చించి నిర్మాణం.. నిర్వహణ లేక శిథిలం
- గ్రామాల్లో రోడ్లకిరువైపులా చెత్తకుప్పలు
- పల్లెల్లో ప్రహసనంగా పారిశుద్ధ్య పనులు

ఆలూరు రూరల్/కృష్ణగిరి: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచి, చెత్త నుంచి సంపద సృష్టించేందుకు సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీఎస్)ను నిర్మించారు. ఆలూరులో బళ్లారి రోడ్డులో నిర్మించిన చెత్త సంపద కేంద్రం నిర్వహణ లేక శిథిలమైపోయింది. 2015లో స్వచ్ఛ భారత్ కింద రూ.4 లక్షల గ్రామ నిధులు వెచ్చించి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో ఇంటింటి నుంచి సేకరించిన పొడి చెత్త, తడి చెత్త ద్వారా కొద్ది రోజులు వర్మీకం పోస్టు తయారు చేసి వదిలేశారు. నిర్వహణ లేకపోవడంతో పైకప్పు శిథిలమైంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ పక్కనే వేస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. కృష్ణగిరి మండలంలోని 16 పంచాయతీల్లో ఒక్క కేంద్రం కూడా వినియోగంలో లేవు. ప్రస్తుతం గ్రామాల్లో రోడ్డుకిరువైపులా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పల్లెల్లో పారిశుద్ధ్య పనులు, చెత్త కుప్పలను తొలగించడం ప్రహసనంగా మారింది.


ఆలూరు డంపింగ్ యార్డులో నిరుపయోగంగా ప్లాస్టిక్ రీసైక్లింగ్ యంత్రం


ఎరుకల చెరువులో నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

మూలన చేరి తుప్పు పట్టిన రిక్షాలు

వెల్దుర్తి ఈఓగా లక్ష్మీనాథ్

వెల్దుర్తి: స్థానిక మేజర్ పంచాయతీ ఈఓగా కనికె లక్ష్మీనాథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తారకేశ్వరి బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో సి.బెళగల్ నుంచి రెగ్యులర్ బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో పట్టణంలో పరిశుభ్రత, నీటి సరఫరా, ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. పట్టణంలో గృహ నిర్మాణాల అప్రూవల్స్ కోరేవారు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ

వెల్దుర్తి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో మంగళవారం మండలంలోని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు వీసీ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఎంపీడీఓ సుహాసిని, ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్వీ హాజరయ్యారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉపాధి హామీ చట్టం, వారి విధులు, బాధ్యతలపై శిక్షణ ఇచ్చారు. వచ్చే ఆరు నెలల్లో వేతనదారులకు సరైన జీతం అందేలా చేపట్టాల్సిన ప్రాముఖ్యమైన పనుల గురించి అవగాహన కల్పించినట్లు ఏపీఓ లక్ష్మన్న తెలిపారు.

'ఇస్తెమా'కు తరలిన ముస్లింలు

పత్తికొండ(తుగ్గలి) : నంద్యాల జిల్లా ఆత్మకూరులో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న 'ఇస్తెమా'కు మంగళవారం పత్తికొండ నుంచి ముస్లింలు తరలివెళ్లారు. ముస్లిం పెద్దలు హనీఫ్ మౌలానా, అల్తాఫ్, వలి, ఇబ్రహీం, మోహమ్మద్‌మౌలానా, ఎస్‌ఎం నూర్‌బాషా, సాద్దిన్‌నూర్‌బాషాతో పాటు పెద్ద ఎత్తున ముస్లింలు వాహనాల్లో బయలుదేరారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి


పత్తికొండ జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

పత్తికొండ(తుగ్గలి) : జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ చిరంజీవి సూచించారు. మంగళవారం పట్టణ సమీపంలోని మూడు లేఅవుట్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు ఉంటే పొదుపు సంఘాల ద్వారా గానీ, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్లు మంజూరైన వారంతా కట్టుకోవాలన్నారు. అనంతరం పుచ్చకాయలమాడలో ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలో ఇళ్లు మంజూరు చేయాలని కోరిన వారితో మాట్లాడారు. దరఖాస్తు దారుల వివరాలు సేకరించాలని డీఈ విజయకుమర్‌ను ఆదేశించారు. పీడీ వెంట ఎంపీడీఓ సువర్ణలత, వీఆర్వో మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి మునిస్వామి ఉన్నారు.

దుకాణాల అద్దె బకాయిలు చెల్లించండి


దుకాణదారుడితో మాట్లాడుతున్న డీఎస్‌ఓ భూపతి రావు

ఆలూరు రూరల్: స్థానిక ఎల్లార్తి రోడ్డులోని ఇండోర్ స్టేడియంలో పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో బాడుగ ఉన్న వారు అద్దె బకాయిలు చెల్లించాలని జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి భూపతి రావు కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన ఇండోర్ స్టేడియం పరిధిలో అద్దెకు తీసుకున్న 6 మంది షాపు యజమానులతో మాట్లాడారు. ఆ షాపుల పరిధిలో దాదాపు రూ.10 లక్షల వరకు అద్దె బకాయిలు రావాల్సి ఉందన్నారు. నెలాఖరులోపు పెండింగ్ అద్దె చెల్లించాలని సూచించారు. లేని పక్షంలో షాపులు సీజ్ చేసి బహిరంగ వేలాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

జాతీయ స్థాయి సెపక్ తక్రాలో రాణించాలి

పది రోజుల పాటు శిక్షణ తీసుకున్న క్రీడాకారులు జాతీయ స్థాయి సెపక్ తక్రా కీడల్లో రాణించాలని డీఎస్‌డీఓ భూపతి రావు అన్నారు. మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో సెపక్ తక్రా జిల్లా స్థాయి క్రీడాకారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు కవిరాజు, సులోచన, చినబాబు పాల్గొన్నారు.

చికెన్ వ్యాపారికి సైబర్ వల

హొళగుంద: మండలంలో చికెన్ దుకాణం నిర్వహించే వ్యాపారిపై సైబర్ నేరగాళ్లు వల విసిరారు. అతని బ్యాంకు ఖాతాలో డబ్బులు లేకపోవడంతో రూ.2 వేల నష్టంతో బయటపడ్డాడు. వివరాలు.. స్థానిక వారపు సంత మార్కెట్‌లో చికెన్ దుకాణం నడుపుకుంటుంటున్న అయూబ్ అనే వ్యక్తికి ఎస్‌బీఐ ఖాతా ఉంది. ఖాతాలో జీరో బ్యాలెన్స్ ఉంది. మంగళవారం అతడు ఫోన్‌పే ద్వారా బ్యాలెన్స్ చెక్ చేసుకోగా రూ.1,98,922 ఉన్నట్టు చూపించింది. అవాక్కయిన అయూబ్ నగదును ఇతరులకు పంపేందుకు ప్రయత్నించగా సెండ్ కాలేదు. సమీప ఎస్‌బీఐ ఏటీఎం, ఆ తర్వాత సర్వీస్ పాయింట్‌లో డబ్బులు డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా విత్‌డ్రా కాకపోవడం, అకౌంట్ హోల్డ్‌లో ఉన్నట్లు చూపించింది. దీంతో వేరే వారి ఫోన్‌పే నుంచి తన ఖాతాలో రూ.2 వేలు జమ చేయించాడు. క్షణాల్లోనే ఆ డబ్బు కట్ కావడంతో వెంటనే ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లి విషయాన్ని చెప్పగా వారు ఖాతను పరిశీలించారు. రేపు సమస్యను తెలుసుకుంటామని చెప్పడంతో అయూబ్ ఇంటిదారి పట్టాడు.


ఫోన్‌పేలో నగదు జమైనట్లు వచ్చిన సందేశాన్ని చూపుతున్న అయూబ్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన జైలో కారు

ఆలూరు రూరల్: మినీ టిప్పర్, కారు ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. మంగళవారం తెల్లవారు జామున మండలంలోని కురువళ్లి గ్రామం సమీపంలో రోడ్డు ప్రమాదంలో జరిగింది. రాయచూర్ నుంచి బళ్లారికి వెళ్తున్న మినీ టిప్పర్, బళ్లారి నుంచి మంత్రాలయం వెళ్తున్న మహీంద్ర జైలో వాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ప్రమాదంలో మినీ టిప్పర్‌లో ప్రయాణిస్తున్న అనంతపురం జిల్లా రాయదుర్గంకు చెందిన నారాయణ రెడ్డి, నరేంద్రకు స్వల్పగాయాలు కాగా..జైలో వాహనంలో ప్రయాణిస్తున్న నందవరంకు చెందిన శేఖర్ అనే వ్యక్తి చేతికి గాయమైంది. వీరు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది మెరుగైన చికిత్స కోసం ఆదోని ఆసుపత్రికి వెళ్లారు. ప్రమాదంలో మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు.

సంక్షిప్తం

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

పత్తికొండ(తుగ్గలి) : రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, కార్యదర్శి జగన్నాథం, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంబులయ్య విమర్శించారు. రైతు డిమాండ్ల సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టిన రైతు నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్‌కు మద్దతుగా మంగళవారం పత్తికొండలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలనే డిమాండ్‌తో దల్లేవాల్ 41 రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్నారన్నారు. ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం చదువులరామయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రయ్య, పంపన్నగౌడ్, సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, అధ్యక్షుడు నాగేంద్ర, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి భీమలింగప్ప, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

కాలువ విషయంలో ఘర్షణ

ఆదోని అర్బన్: ఆస్పరి మండలం తంగరడోణ గ్రామంలో స్థలం, కాలువ విషయంలో మంగళవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అందులో మారెప్ప, లక్ష్మన్నకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

కాలనీకి దారి చూపండి

ఆలూరు: పోలీసు శాఖ వారు క్వార్టర్స్‌కు నిర్మించిన ప్రహరీ కారణంగా తమ కాలనీకి దారిలేకపోవడంతో 104, 108 లాంటి అత్యవసర సేవలు సైతం అందడం లేదని పట్టణ కేంద్రంలోని ఉరుకుంద ఈరన్న కొట్టాల కాలనీవాసులు ఉరుకుందప్ప, భాస్కర్, బేగం, ఈరన్న, బాషా తదితరులు మంగళవారం గుంటూరు జిల్లా, పత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, పత్తికొండ డీఎస్పీ బి.వెంకటరామయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు పోలీసులు క్వార్టర్స్‌కు సమీపంలో నిర్మించిన ప్రహరీని పరిశీలించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యేతో పాటు డీఎస్పీ హామీ ఇచ్చారు.

ఆలూరులో 2,60,213 మంది ఓటర్లు

ఆలూరు రూరల్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది ఓటరు జాబితాను విడుదల చేసినట్లు ఆలూరు అసిస్టెంట్ ఎలక్టరోల్ ఆఫీసర్ గోవింద్ మంగళవారం తెలిపారు. జాబితా ప్రకారం నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2,60,213 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో పురుషులు 1,30,633 మంది, మహిళలు 1,29,528 మంది ఉండగా.. 52 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం గత ఏడాది అక్టోబర్ 29 తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించామన్నారు.

ప్రతి చిన్నారికి టీకాలు వేయాలి

మద్దికెర : ఐదేళ్ల లోపు వున్న ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ప్రభుత్వ వైద్యులు శ్రీలక్ష్మి, రాగిణి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మాతా శిశు మరణాలను నిరోధించేందుకు ప్రతి ఇంటికి వెళ్లి గర్భిణులను గుర్తించి, రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. అలాగే పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, రోగ్య పర్యవేక్షకులు కృష్ణమ్మ పాల్గొన్నారు.

ఘనంగా నెల రోజుల పూజ

కృష్ణగిరి: మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలో మారెమ్మ దేవర చేసి నెల రోజులు పూర్తి కావడంతో మంగళవారం గ్రామస్తులు అమ్మవారికి పూజ కార్యక్రమాలు చేపట్టారు. మారెమ్మ, సుంకులమ్మ దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రతి ఇంటి నుంచి భక్తులు నేవేద్యం, కాయూ కర్పూరం సమర్పించి పూజలు చేశారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను వేడుకున్నారు.

మారెమ్మ తల్లీ.. కరుణించమ్మా



కృష్ణగిరి: మండలంలోని అమ్మవార్ల దేవాలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్లూరు గ్రామంలోని మారెమ్మకు, ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆస్పరి: ఆస్పరిలోని మారెమ్మవ్వ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు గోవిందు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

స్కూల్ స్థలం ఆక్రమణలపై విచారణ


ఆక్రమణలపై విచారిస్తున్న ఎంపీడీఓ

వెల్దుర్తి: పాతబస్టాండు సమీపంలోని కర్నూలు రోడ్డు ఉన్న బాలుర ఉన్నత పాఠశాల స్థలం ఆక్రమణలపై ఎంపీడీఓ సుహాసిని మంగళవారం విచారణ చేపట్టారు. హైస్కూల్ ఎస్‌ఎం కమిటీ జిల్లా పరిషత్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు ఆమె తెలిపారు. హైస్కూల్ మెయిన్ గేట్ పక్కన ఎడమ వైపు నుంచి దాదాపు 30మందికి పైగా షాపుల నిర్మాణాలు పాఠశాల స్థలంలోకి 70 శాతం మించి ఆక్రమించుకున్నారని, మిగితా భాగం ఆర్‌అండ్‌బీ స్థలంలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ప్రస్తుతం షాపుల వారు ఆయా స్థలం, నిర్మాణాలకు సంబంధించిన పత్రాలేమైనా ఉంటే 10వ తేదీ తన కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ ముతాల చిన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు


పెద్దహోతూరులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గోవింద్ సింగ్

ఆలూరు రూరల్: గత ఏడాది డిసెంబర్ నెల 6వ తేదీ మండలంలో ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు మంగళవారం పెద్దహోతూరులో నిర్వహించిన సదస్సుతో ముగిశాయి. 18 రెవెన్యూ గ్రామాల పరిధిలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 335 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ గోవింద్ సింగ్ తెలిపారు. ఈ అర్జీలలో ఇప్పటి వరకు 113 సమస్యలకు పరిష్కారం చూపినట్లు వెల్లడించారు. మిగతా అర్జీలు దరఖాస్తుదారులకు ఇచ్చిన గడువులోగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అరుణజ్యోతి, జూనియర్ అసిస్టెంట్ మహేష్, వీర్వోలు చిదానంద, రవి కుమార్ గ్రామస్తులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారం

హొళగుంద: రెవెన్యూ శాఖకు సంబంధించి సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నటు తహసీల్దారు సతీష్ తెలిపారు. మంగళవారం పెద్దగోనెహాళ్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు 13 అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దారు తెలిపారు. వీఆర్‌ఓ నాగరాజు, సచివాలయ సర్వేయర్లు ఆనంద్ పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆ గ్రామ రైతుల నుంచి భూ సమస్యలపై తహసీల్దార్ శివశంకర్ నాయక్ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోయజాక్షప్ప, డీటీ భీమేష్, వీర్‌ఓ పులిశేఖర్ పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణపై విచారణ

వెల్దుర్తి: ఇటీవలి కులగణన సర్వేలో ఎస్సీ జాబితాలో చేర్చిన మాదాసి కురుబల కుల ధ్రువీకరణపై తహసీల్దార్ విచారణ చేపట్టారు. మంగళవారం ఎల్. నగరం, బింగిదొడ్డి, పలు గ్రామాలలో పర్యటించి వారి వారి స్థితిగతులు, ధ్రువీకరణ పత్రాలు సేకరించారు. బుధవారం వెల్దుర్తి పట్టణంలో, తదుపరి రోజులు మిగితా గ్రామాలలో విచారించనున్నట్లు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

పత్తికొండ(తుగ్గలి) : మాదాసి కురువ, మాదారి కురవ పేరుతో ఎస్సీలని ప్రచారం చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పులికొండ, వెంకటేశ్వర్లు, నరసింహులు, ఈశ్వరయ్య, రంగస్వామి, లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. మాదాసి కురువ, మాదారి కురవ అని చలామణి అవుతూ ఎస్సీ సర్టిఫికెట్లు పొందేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకం ద్వారా అన్ని గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే గ్రామాల్లో వలసలు ప్రారంభమయ్యాయని, సంక్రాంతి తర్వాత మరింత పేరిగే అవకాశం ఉంటుందన్నారు. ముందు జాగ్రత్తగా అన్ని గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించడంతో పాటు వలసలు వెళ్లకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని గ్రామాల్లో దండోరాలు వేయించి అడిగిన వారందరికీ పనులు కల్పించాలని ఆదేశించారు. ఏపీఓ నాగసులోచన, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

దేవనకొండ: ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు అందించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశావర్కర్ల యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా నాయకురాలు రమీజాబీ, తులసి, రాధిక, రాధ డిమాండ్ చేశారు. మంగళవారం దేవనకొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశా కార్యకర్తలు నిరసన తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోని అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాళ్లు నాగవేణి, అనిత, హైమావతి, నిర్మల, కమలాక్షి, కృష్ణవేణి, విజయలక్ష్మి, రాజమ్మ, కాంతమ్మ, జైనబీ తదితరులు పాల్గొన్నారు.

కాల్చితే కాలుష్యం..

కలియదున్నితే భూమికి బలం

- పంట వ్యర్థాలు కాల్చితే నేలకు అనారోగ్యం
- చనిపోతున్న సూక్ష్మజీవులు
- మొక్కకు అందని పోషకాలు
- ఎన్ని ఎరువులు వేసినా నిష్ప్రయోజనం
- కలియదున్నితే భూమికి బలం


కంది కొయ్యలను కాల్చివేస్తున్న దృశ్యం

తుగ్గలి : పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రావాలంటే నేల ఆరోగ్యం ప్రధానం. సంప్రదాయంగా చేయాల్సిన పనులను రైతులు విస్మరిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పంట అవశేషాలు (పత్తి కట్టె, కంది కొయ్యలు, చెత్త చెదారం) పొలంలోనే కాల్చకుండా కలియదున్నేవారు. ప్రస్తుతం అనాలోచిత చర్యలతో వ్యర్థాలను కాల్చివేస్తున్నారు. దీంతో పంట దిగుబడుల కోసం బస్తాల కొద్దీ రసాయ ఎరువులు కుమ్మరించినా ఉపయోగంలేకుండా పోతోంది.

దిగుబడులకు నేల ఆరోగ్యం ముఖ్యం..

వాతావరణ, నాణ్యమైన విత్తనాలు మాత్రమే అధిక దిగుబడులకు కారణభూతం కాదు.. అంతకంటే ముఖ్యమైంది నేల ఆరోగ్యం. అశాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తూ.. నేల సహజత్వం కోల్పోయేలా చేస్తున్నారు. ఆనక.. అధిక దిగుబడి కోసం లెక్కకు మించి రసాయన ఎరువుల వేస్తున్నా.. ఫలితం రావడం లేదు. నేల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసేది భూమిలో ఉండే సేంద్రియ కర్బనం. ఇది భూమిలో ఉండే సూక్ష్మజీవులకు ఆహారంగా ఉపయోగపడుతుంది.దీంతో సూక్ష్మజీవులు నేల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర వహిస్తాయి. భూమిలో సహజసిద్ధంగా ఉండే నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు ఎప్పటికప్పుడు సూక్ష్మజీవులు మొక్కలకు అందిస్తాయి. దీంతో పాటు రైతులు వేసే రసాయన ఎరువుల్లోని పోషకాలు మొక్కలకు అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

సేంద్రియ కర్బనం అంతంతే..

పశువుల ఎరువు, కోళ్ల, గొర్రెల ఎరువు, పంట అవశేషాలు భూమిలో కలియదున్నడం, పచ్చిరొట్టె ఎరువుల వల్ల భూమిలో సేంద్రిక ర్బనం వృద్ధి చెందుతుంది. ప్రస్తుతం రైతులు ఈ పద్ధతులకు ఎన్నడో దూరమయ్యారు. దీంతో సేంద్రియ కర్బనం దాదాపు కనుమరుగవుతోంది. కనీసం పంటలో పనికిరాని కలుపు మొక్కలు, పంట అయిపోయిన తర్వాత మిగిలే వ్యర్థాలు భూమిలో కలియదున్నమన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ట్రాక్టర్ రొటావేటర్, నాగలి, గుంటకతో సేద్యం చేస్తే పంట అవశేషాలు భూమిలో కలిసిపోయి, పెద్దగా రసాయనాలు అవసరం లేకుండా పంటలు పండించుకోవచ్చు. పత్తి, కంది కట్టెలు, ఇతర వ్యర్థాలను గుంతలో వేసి కాస్త ఇసుక వేసి మగ్గపెడితే అది ఎరువుగా మారుతుంది.

పుడమికి మంచి ఎరువు



భూమిలో పంట అవశేషాలు కలియదున్ని, ఎకరాకు మూడు బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే భూమిలో మగ్గి మంచి ఎరువుగా ఉపయోగ పడుతుంది. దీంతో రసాయన ఎరువులకు పెట్టే ఖర్చు 50 శాతం తగ్గుతుంది. అవశేషాలు కాల్చివేయడం వల్ల పొలంతో పాటు, వాతావరణానికి ముప్పుగా మారుతుంది. – పవన్‌కుమార్, ఏఓ, తుగ్గలి

పంట అవశేషాలకు అగ్గి

ఒక రైతును చూసి మరో రైతు పంట అవశేషాలను కాలబెడుతున్నారు. దీంతో భూమిలో ఉండే సూక్ష్మజీవులు చనిపోతున్నాయి. అలాగే.. అవశేషాలను కాలబెట్టినప్పుడు వాతావరణంలోని కార్బన్‌డైయాక్సైడ్ కార్బన్ మోనాక్సైడ్‌గా మారి పొగతో వాతారణం కలుషితమవుతుంది. వాతావరణం వేడెక్కి సమస్యలు ఉత్పన్నమవుతాయి.